# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం | 21 ఆగస్టు 2025 | పేజీలు 8




మృతి చెందిన ఎనిమిది నెలల సుభాష్.. ఫైల్‌ఫోటో..

### ఆర్థిక ఇబ్బదులు.. అధిక సంతానం..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి. బాచుపల్లిలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో ఓ గదిని కిరాయికి తీసుకుని నివాసముంటున్న వీరికి ఎనిమిది నెలల క్రితం మరో కొడుకు (4వ కుమారుడు) సుభాష్ జన్మించాడు.. భర్త లక్ష్మన్ ఇటుక లారీపై కూలీపనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.. అయితే లక్ష్మణ్‌కి కూతురును కనాలనే కోరికతో, ఇప్పటికే నలుగురు కొడుకులే జన్మించారు.. ఓవైపు అధిక సంతానం.. మరోవైపు తనకు కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించక పోవడంతో..! భర్తతో తరచూ గొడవపడుతుంది.. దీనికి తోడు ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో భార్యా భర్తల నడుమ గొడవలు చెలరేగాయి.. ఈ క్రమంలో మంగళవారం కూడా ఆ దంపతులకు చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది..



సంపులో మృతి చెందిన చిన్నారులు..



మృతి చెందిన మూడవ కుమారుడు అరుణ్.. ఫైల్‌ఫోటో..

# కన్న కొడుకులే..! ఆ తల్లికి భార మయ్యారా..?

**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 20:** కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు, అధిక సంతానం,కన్న కొడుకులే ఆతల్లికి భారమయ్యారో ఏమో కానీ..! భర్తపై కోపంతో ఇద్దరు చిన్నారులని సంపులో పడేసిన తల్లి కూడా అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో.. తీవ్ర విషాదం చోటుచేసుకుంది.. చిన్నారులు ఊపిరాడక మృతి చెందగా, తక్కువ నీరు ఉండటంతో స్థానికుల ద్వారా ప్రాణాపాయం నుండి బయటపడిన ఆ తల్లి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటుంది.. ఈ ఘటన స్థానికంగా పలువురిని కంటతడి పెట్టించింది.. బాచుపల్లి సిఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, పిట్లం మండలం, ధర్మారం గ్రామానికి చెందిన లక్ష్మన్ అనే వ్యక్తితో సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని తురకవాడగమ్మ గ్రామానికి చెందిన రత్నతో 11 ఏండ్ల క్రితం (2014లో) వివాహమైంది వీరికి నలుగురు కొడుకులు అజయ్ (3), పవన్ (7), అరుణ్ (3) లతో పాటు ఎనిమిది నెలల వయస్సున్న సుభాష్ అనే కొడుకు ఉన్నారు.. దంపతులు తమ పెద్దకొడుకులు ఇద్దరు అజయ్, పవన్లను తమ సొంతూరు ధర్మారంలోని లక్ష్మన్ తల్లిదండ్రుల వద్దనే ఉంచి రేండేండ్ల క్రితం, మూడో కొడుకు అరుణ్‌తో కలిసి రేండేండ్ల క్రితం ఉపాధికోసం నగరానికి వలసవచ్చారు..

- బాచుపల్లి పియస్ పరిధిలో కంటతడి పెట్టించే దారుణ ఘటన..
- ఇద్దరు చిన్నారులని నీటి సంపులో పడేసి తానూ దూకిన తల్లి..
- చిన్నారులు మృతి చెందగా.. ప్రాణాపాయం నుండి తల్లిని కాపాడిన స్థానికులు..

### అర్ధరాత్రి సమయంలో దారుణ ఘటన..

మంగళవారం రాత్రి లక్ష్మణ్ ఇటుక లోడును అన్‌లోడ్ చేసేందుకు లారీపై పటాన్ చెరువుకు వెళ్లాడు.. భర్త తన మాటను పెడచెవిన పెడుతున్నాడని, మానసిక ఆందోళనకు గురైన భార్య రత్న అర్ధరాత్రి 1-2 గంటల సమయంలో తన ఇద్దరు కొడుకులను ఇంటి ముందున్న నీటిసంపులోకి తోసింది ఆతర్వాత తనూ దూకింది. అయితే సంపులో 3 ఫీట్ల వరకు మాత్రమే నీరు ఉండటంతో చిన్నారులు నీటమునిగి ఊపిరాడక దుర్మరణం చెందగా, నీటిలో ఉన్న రత్నను పక్కగదిలో నివాసం ఉంటున్న వారు గమనించి బయటకు తీశారు.. అనంతరం పోలీసులకు, భర్తకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్ట్ మార్టంకోసం చిన్నారులు అరుణ్, సుభాష్ మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రత్న ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె ప్రాణాలకు ఎటువంటి ఆపాయం లేదని పోలీసులు పేర్కొంటున్నారు.

# 40 ఏళ్ళుగా నిరీక్షిస్తున్నాం..! న్యాయం చేయండి..!

### శ్రీ వెంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ప్రెస్‌మీట్..

- ఫాక్స్‌సాగర్ చెరువు శిఖంలోనే ఉమామహేశ్వర కాలనీ ఉంది..!
- ఫాక్స్‌సాగర్ చెరువు శిఖం పట్టాభూమి లోనే తమ లేఅవుట్ ప్లాట్‌లు ఉన్నాయి..
- ఇరిగేషన్ అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు..
- 406 ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆవేదన..40 ఏళ్ళ నిరీక్షణ..
- ఓమార్వాడికి వరద తాకిడి నుండి కాపాడేందుకు,తమవైపు డ్రైనేజీ మళ్ళింపు.?
- దూలపల్లి గ్రామ సర్వే నెం.124, 125, 126 పట్టాభూమిలో 22 ఎకరాల లేఅవుట్..
- 1992-94లో గ్రామపంచాయతి ఆమోదంతో 406 ప్లాట్‌లతో లేఅవుట్ నిర్మాణం..
- చెరువు శిఖం పట్టా భూమి లేఅవుట్‌లో 40 ఏళ్ళ క్రితమే ప్లాట్‌ల కొనుగోలు..
- లేఅవుట్‌లో విద్యుత్ స్థంబాలు, డ్రైనేజీ, సీసీరోడ్లు వేశారన్న బాధితులు..
- కొందరు ఎల్ఆర్ఎస్‌లు కట్టామని, ఇప్పటికీ ఇంటి పన్నులు చెల్లిస్తున్నట్టు ఆధారాలు.



శ్రీ వేంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు..

-3 లో

# రహదారుల శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, వంతెనల శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలను రూపొందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన తెగిన రోడ్లు, కల్వర్టులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. హైదరాబాద్‌లోని

-3 లో

శ్రీ వేంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు..



# 40 ఏళ్ళుగా నిరీక్షిస్తున్నాం..!

# న్యాయం చేయండి..!

డ్రైనేజీ నీటిని ఫాక్స్‌సాగర్ చెరువులోకి మళ్ళిస్తున్న ఇరిగేషన్ రామారావు..



## శ్రీ వెంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ప్రెస్‌మీట్..

- దూలపల్లి గ్రామ సర్వే నెం.124, 125, 126 పట్టాభూమిలో 22 ఎకరాల లేఅవుట్..
- 1992-94లో గ్రామపంచాయతి ఆమోదంతో 406 ప్లాట్‌లతో లేఅవుట్ నిర్మాణం..
- చెరువు శిఖం పట్టా భూమి లేఅవుట్‌లో 40 ఏళ్ళ క్రితమే ప్లాట్‌ల కొనుగోలు..
- లేఅవుట్‌లో విద్యుత్ స్థంబాలు, డ్రైనేజీ, సీసీరోడ్లు వేశారన్న బాధితులు..
- కొందరు ఎల్ఆర్ఎస్‌లు కట్టామని, ఇప్పటికీ ఇంటి పన్నులు చెల్లిస్తున్నట్టు ఆధారాలు..

చెరువులను ఎన్‌వోసి ద్వారా విస్తీర్ణాన్ని కుదించి అక్రమార్కులకు కట్టబెట్టిన, ఆధారాలు ఉన్నాయి.. కట్టు కాలువలు కబ్జాదారులకు పట్టం కట్టిన ఫాక్స్‌సాగర్ నాలాలు పక్కనే ఉన్నాయి.. దీనికితోడు ఇరిగేషన్ రిటైర్డ్ ఏఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న రామారావు, వర్షపు నీరుతో పాటు డ్రైనేజీ నీటిని ఫాక్స్‌సాగర్ చెరువులోకి మళ్ళించి, చారిత్రక చెరువును మురికి కూపంగా మారుస్తున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. డ్రైనేజీ నీటిని ఫాక్స్‌సాగర్ చెరువులోకి మళ్ళించకుండా, రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు.. ఈ డ్రైనేజీ లైన్ ద్వారా వెళ్ళాల్సిన నీటిని, ఇరిగేషన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి జేసిబితో పైనుండి వచ్చే డ్రైనేజీ నీరును చెరువులోకి మళ్ళించారని, స్థానికులు ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 20:

- మిగతా 3లో...


- ఫాక్స్‌సాగర్ చెరువు శిఖంలోనే ఉమామహేశ్వర కాలనీ ఉంది..!
- ఫాక్స్‌సాగర్ చెరువు శిఖం పట్టాభూమి లోనే తమ లేఅవుట్ ప్లాట్‌లు ఉన్నాయి..
- ఇరిగేషన్ అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు..
- 406 ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆవేదన..40 ఏళ్ళ నిరీక్షణ..
- ఓమార్వాడికి వరద తాకిడి నుండి కాపాడేందుకు,తమవైపు డ్రైనేజీ మళ్ళింపు.?

పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ నీటిని ఫాక్స్‌సాగర్ చెరువులోకి మళ్ళించిన, వ్యవహారంలో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు.. ఇరిగేషన్ అధికారుల తీరుపై మండి పడ్డారు.. ఒకేచోట రెండు లేఅవుట్‌ల పట్ల అధికారులు ద్వంద వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు..

ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టిఎల్ బఫర్ ముంపు ప్రాంతంలో ఉన్న ఉమామహేశ్వర కాలనీకి సకల సౌకర్యాలు కల్పించిన, ప్రభుత్వం, అధికారులు.. అదే చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో, ఆ కాలనీ పక్కనే ఉన్న, లేఅవుట్‌లోని శ్రీ వెంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు అన్యాయం చేస్తున్నారని, తమకు న్యాయం చేయండి అంటూ బుధవారం మీడియా ద్వారా ప్రభుత్వాన్ని వేడుకున్నారు.. దుండిగల్ గండిమైసమ్మ మండలం, కొంపల్లి మున్సిపల్ పరిధిలోని దూలపల్లి గ్రామ శివారు సర్వే నెం.124లోని పలు సబ్ డివిజన్‌లు, 125, 126 పట్టాభూమి మొత్తం 22 ఎకరాలు 1992-94లో దూలపల్లి గ్రామపంచాయతి కార్యాలయం నుండి ఆమోదం పొంది 406 ప్లాట్‌లతో లేఅవుట్ నిర్మాణం జరిగింది.. వివిధ ప్రాంతాల వాసులు సంబంధిత లేఅవుట్‌లో ప్లాట్‌లు కొనుగోలు చేశారు.. విద్యుత్ స్తంభాలు, కరెంటు మీటర్లు తీసుకున్నామని, ఇంటి నెంబర్‌లు ఇచ్చారని, 2025 మార్చి నెలలో హౌస్ టాక్స్ చెల్లించిన రసీదును మీడియా సమావేశంలో వెల్లడించారు.. తాము ప్లాట్‌లు కొనుగోలు చేసిన సమయంలో(1992 లో) ఎఫ్‌టిఎల్ పిల్లర్‌లు నిర్ధారించ లేదని, 2013లో ఎఫ్‌టిఎల్ పిల్లర్‌ల ఏర్పాటు సమయంలో తమ లేఅవుట్ ప్లాట్‌లను ఫాక్స్‌సాగర్ చెరువు శిఖం పట్టా భూమిగా చూపించి నట్లు, శ్రీ వెంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు.. ఈ విషయంపై తాము హైకోర్టును ఆశ్రయించామని, తమకు కోర్టు ఆర్డర్ ఉందని అన్నారు.. రెండేళ్ళ క్రితం వెంచర్‌లో నిరుపయోగంగా ఉన్న గదులను, కూడా శిధిలావస్థలో ఉన్నవి కూల్చేసే ప్రక్రియలో భాగంగా, చర్యలకు దిగిన అధికారులని తాము అడ్డుకుని, కంటెంట్ ఆఫ్ కోర్టు కింద నోటీసులు పంపించామని బాధితులు తెలిపారు..



ఫాక్స్‌సాగర్ చెరువులోకి డ్రైనేజీ మళ్ళింపు ఇదే..



గ్రామపంచాయతి ఆమోదం పొందిన 406 ప్లాట్‌ల లేఅవుట్..

# 40 ఏళ్ళుగా నిరీక్షిస్తున్నాం..! న్యాయం చేయండి..!



చెరువు శిఖంలో వెంచర్ ఇదే..



Print On : 23-03-2025 09:14:18

MUNICIPAL ADMINISTRATION DEPARTMENT
Kompally Municipality
Medchal Malkajgiri District - Telangana State
RECEIPT FOR PROPERTY TAX

No: MIDPTOP0087606082155176584

Payment Date: 06-Apr-2024

| | |
|---|---|
| PTIN(Property Tax Identification Number) | 1265100876 |
| Owner Name | Nalla Uma |
| House Number | 5-41/1/308 |
| Amount Paid (Excluding PG Charges) | 1926 (Rs) |
| Transaction No | PTOP0087606082155176584 |
| Transaction Date | 06-Apr-2024 |
| Locality Name | Doolapally |
| Balance Amount | -- (Rs) |
| Mode Of Payment | BD-CC |
| Payment Period From | 01-APR-2024 |
| Payment Period To | 31-MAR-2025 |
| Rebate Percentage | 5 % |
| Rebate(Saved) Amount | 102 (Rs) |
| Deviation Penalty | 0 /(Rs) |
| Transaction Status | SUCCESS |
| QR Code | |

*It is a computerized Receipt, signature not required.

ఈఏడాది ఇంటి పన్ను చెల్లించిన రశీదు..

## చెరువులకి డ్రైనేజీ నీరు మళ్లింపుతో తలెత్తిన సమస్య..

వరద నీటితో పాటు, డ్రైనేజీ నీటిని తమ ప్లాట్ల మీదుగా చెరువులోకి వదులు తున్నారని, ఫాక్స్‌సాగర్ చెరువు శిఖంలో ఉన్న 22 ఎకరాల లేఅవుట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు..1992-94 సంవత్సరంలో, తాము పైసా పైసా కూడ బెట్టుకుని, నెలకు రూ.500 చొప్పున ఇన్‌స్టాల్ మెంట్‌లు చెల్లించి ప్లాట్‌లు కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు.. ఎల్ఆర్ఎస్‌లు కట్టామని, మరికొన్ని ప్లాట్‌లకు దరఖాస్తులు చేసుకున్నట్లు, మీడియా సమావేశంలో పేర్కొన్నారు.. గ్రామపంచాయతి ఆమోదం పొందిన వెంచర్ ప్లాట్‌లు కొనుగోలు చేసిన తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు.

## రహదారుల శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలి

- మొదటి పేజి తరువాయి


మంత్రుల నివాస సముదాయం నుంచి ఆర్ అండ్ బీ అధికారులతో బుధవారం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. “రాష్ట్ర రహదారుల చీఫ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఒక్కో షిఫ్టులో నలుగురు చొప్పున 24 గంటలు పర్యవేక్షణ చేపట్టాలి’ అని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ పరిధిలో 739 చోట్ల సమస్యాత్మక రోడ్లను గుర్తించామని మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో 854 కి.మీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయని, 25 చోట్ల తెగిపోయాయని వివరించారు. వర్షాలతో 228 చోట్ల దారిమళ్లింపు చేశామని, 175చోట్ల వెంటనే పనులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## సినిమా పాలసీపై కార్మికుల సమ్మె ప్రభావం .. చర్చలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్ పెన్ పవర్: గత 17 రోజులుగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మె వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకుంది. సమ్మె కారణంగా తెలుగుతో పాటు ఇతర భాషల సినిమా షూటింగులు కూడా నిలిచిపోవడంతో ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జోక్యంతో ఈ రోజు కీలక పరిణామాలు చోటుచేసుకోను న్నాయి. హైదరాబాద్‌ను దేశంలోనే ప్రధాన సినిమా హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ సమ్మె అడ్డంకిగా మారిందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర సినిమా పాలసీపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులతో ఒక విడత చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా, ఈరోజు ఫెడరేషన్ నాయకులతో కూడా సమావేశం కానున్నారు. డీజీపీ సైతం ఫెడరేషన్ నేతలతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

## గ్రాండ్ చాంపియన్ ట్రోఫీని దక్కించుకున్న వి.అభినవ్

**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగష్టు 20:** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో యొద్ద గోజురియో స్పోర్ట్స్ కరాటే డు ఆర్గనైజేషన్ విద్యార్థి వి.అభినవ్ గ్రాండ్ చాంపియన్ ట్రోఫీని సాధించాడు. వి.అభినవ్ కు గ్రాండ్ చాంపియన్ ట్రోఫీని కరాటే గ్రాండ్ మాస్టర్ జి.విఠల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే పోటీల్లో తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్మన్ బి.రాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు



రాధేశ్యామ్ తివారీ, ప్రధాన కార్యదర్శి తీగల శ్రీనివాస్, కరాటే విద్యార్థులు రఘు, మాస్టర్లు పి.రాము, డి.రాము, పాల్గొన్నారు.

## యూరియాపై కాంగ్రెస్ అసత్య ప్రచారం

**హైదరాబాద్ పెన్ పవర్:** యూరియాపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారంపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నానంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అదనంగా యూరియా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. తాను చెప్పింది తప్పయితే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, నిజమైతే మీరు రాజీనామా చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. “గత రబీలో తెలంగాణకు 9.87 లక్షల టన్నుల యూరియా అవసరముంటే కేంద్రం 12.47 లక్షల టన్నులను సరఫరా చేసింది. రాష్ట్రం 10.43 లక్షల టన్నులు అమ్మగా.. మరో 2.04 లక్షల టన్నులు ఓపెనింగ్ స్టాక్‌గా ఉంది. ఈ ఖరీఫ్‌లో ఆగస్టు వరకు 8.30 లక్షల టన్నులకు 5.18 లక్షల టన్నుల యూరియాను కేంద్రం సరఫరా చేసింది. రాష్ట్రం వద్ద 7.22 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ముందుగానే స్టాక్ లేదని అబద్ధాలు చెప్పడం సరికాదు. కాంగ్రెస్ బీసీ వర్గానికి చెందిన అభ్యర్థిని ఉప రాష్ట్రపతిగా ఎందుకు ప్రకటించలేదు. వీహెచ్ పేరు ప్రకటించాలి కదా? తెలుగు ప్రైడ్ అని మాట్లాడుతున్న కాంగ్రెస్.. గతంలో వెంకయ్యనాయుడికి ఎందుకు మద్దతివ్వలేదు. మార్వాడీ గో బ్యాక్ నినాదాల వెనుక అర్బన్ మావోయిస్టుల వంటి శక్తులు ఉన్నాయి” అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం: మంత్రి జూపల్లి



హైదరాబాద్ పెన్ పవర్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం, చట్టపరంగా అందాల్సిన సాయాన్ని అందిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. బుధవారం ఆయన కుమురంభీం జిల్లాలో పర్యటించారు. ఆసిఫాబాద్ మండలంలోని రాజురా గ్రామానికి వెళ్లే రోడ్డు కల్వర్టు వరదతో కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. కుమురం భీం ప్రాజెక్టు మరమ్మతులకు ప్రతిపాదనలు కేంద్రానికి పంపామని, అనుమతి రాగానే అంచనాలు రూపొందించి వీలైనంత త్వరగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలతో పంట, పశునష్టంతోపాటు రోడ్లు చాలా దెబ్బతిన్నాయన్నారు. ఇసుక మేటలు వేసి పంట నష్టపోయిన వారిని కూడా పరిహారం పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. జైనూర్ మండలం మార్లవాయి గ్రామ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం రాత్రి బస చేసిన మంత్రి జూపల్లి బుధవారం ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. సరిగా చదవడం, రాయడం, లెక్కలు అడిగినా చెప్పకపోవడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

## రొట్టెలు ఎందుకు చేయలేదన్న భర్త... కత్తితో ఛాతీలో పొడిచిన భార్య!



హైదరాబాద్ పెన్ పవర్:రొట్టెలు ఎందుకు చేయలేదని అడిగినందుకు ఓ భార్య దారుణానికి ఒడిగట్టింది. భర్తతో మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో కత్తి తీసుకుని అతడి ఛాతీలో పొడిచింది. ఈ షాకింగ్ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, రాస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని మహవీర్ అఖాడా ప్రాంతానికి చెందిన సంజయ్ కుమార్ (28) భోజనం కోసం ఇంటికి వచ్చాడు. అయితే ఇంట్లో పిండి అయిపోవడంతో, అతని భార్య ముగ్గురు పిల్లలతో పాటు భర్తకు కూడా కిచిడీ వండిపెట్టింది. కానీ తనకు రోటీలే కావాలని సంజయ్ పట్టుబట్టడంతో దంపతుల మధ్య వాగ్వాదం మొదలైంది.ఈ క్రమంలో సహనం కోల్పోయిన భార్య, వంటగదిలోని కత్తి తీసుకుని సంజయ్ ఛాతీపై దాడి చేసింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని, సంజయ్‌ను స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు.ఈ ఘటనపై తమకు ఇంతవరకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

# మధ్య యుగం రోజుల్లోకి వెళుతున్నాం.. కేంద్రం కొత్త బిల్లులపై రాహుల్.. నల్లచొక్కా ధరించి నిరసన



హైదరాబాద్ పెన్ పవర్:ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రులు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొని నెల రోజుల జైలులో ఉంటే వారిని పదవి నుంచి తొలగించే మూడు బిల్లులను అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్ల చొక్కా ధరించి లోక్ సభలో నిరసన తెలిపారు. అమిత్ షా ఈ బిల్లులను ప్రవేశపెట్టడాన్ని రాహుల్ ఖండించారు.ఈ బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలనే ఎన్డీయే తీరు చూస్తుంటే మన దేశాన్ని మళ్లీ మధ్య యుగ కాలంలోకి తీసుకెళ్తున్నట్లు అనిపిస్తోందని రాహుల్ మండిపడ్డారు. ప్రధానమంత్రితో పాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు అరెస్ట్ అయిన తర్వాత 30 రోజులు జైలులో ఉంటే వారిని తొలగించే మూడు బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. విపక్షాల నిరసనల మధ్య ఈ బిల్లులను అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు.ఈ బిల్లులపై రాహుల్ స్పందిస్తూ.. మనం మధ్యయుగ కాలానికి తిరిగి వెళ్తున్నామని, ఆ కాలంలో రాజు తన ఇష్టానుసారం ఎవరినైనా పదవి నుంచి తప్పించగలడని చెప్పారు. అతనికి ఎవరి ముఖమైన నచ్చకపోతే, అతను వారిని అరెస్టు చేయమని %జుణ%ని కోరగలడని రాహుల్ ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన వ్యక్తిని 30 రోజుల్లోగా బహిష్కరించగలదని ఈ బిల్లులపై స్పందించిన క్రమంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ నిప్పులు చెరిగారు. ఈ బిల్లుల కాపీలను చించి అమిత్ షాపైకి విపక్ష సభ్యులు విసిరేయడంతో లోక్ సభలో గందరగోళం నెలకొంది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. నినాదాలు చేశారు. పలుమార్లు సభ వాయిదా పడింది.రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారికి, రాజ్యాంగాన్ని పరిరక్షించే వారికి మధ్య యుద్ధం జరుగుతుందని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఈ బిల్లులను "క్రూరమైన" చట్టంగా చెప్పుకొచ్చాయి. సీఎం, మినిస్టర్స్?ను ఏక పక్షంగా అరెస్ట్ చేసి.. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను అస్థిరపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందని విపక్షాలు మండిపడ్డాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మంత్రి వి. సెంథిల్ బాలాజీ జైలులో ఉన్నప్పటికీ పదవుల్లో కొనసాగిన సంగతి తెలిసిందే. అయితే.. ఇలా కొనసాగడం సబబు కాదనేది కేంద్ర ప్రభుత్వ వాదన. ప్రతిపక్ష పార్టీలను అస్థిరపరిచి అక్కడి ప్రభుత్వాలను పడగొట్టే దురుద్దేశంతో అధికార ఎన్డీయే కూటమి ఈ బిల్లులను ప్రవేశపెట్టిందనేది విపక్ష పార్టీల వాదన. ఎవరి వాదన ఎలా ఉన్నా.. ఈ బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టడంతో దేశవ్యాప్త చర్చ జరుగుతోంది.

## వర్షాలు ఇప్పట్లో ఆగేవి కావట.. వాతావరణ శాఖ ఏం చెబుతుందంటే?




హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు నేడు కూడా కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాలోల భారీ వర్షాలు కురుస్తాయని, బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మత్స్యకారులు భారీ వర్షాల కారణంగా వేటకు వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీచేశారు. తీరం వెంట గంటకు నలభై నుంచి అరవై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ కేంద్రం పేర్కొంది. గత కొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. బయటకు వస్తే భారీ వర్షాల్లో చిక్కుకుపోతామని భయపడి చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు.

### మరో వారం రోజులు వర్షాలే...

ఆంధ్రప్రదేశ్ లో మరో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్లూరి, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని చెప్పింది. ఏడు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని మిగిలిన జిల్లాల్లో వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని, విద్యుత్తు స్తంభాలు, చెట్ల కింద ఉండకూడదని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

### తెలంగాణలోనూ భారీ వర్షాలు...

తెలంగాణలోనూ భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగానే ఉండాలని పేర్కొంది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా పేర్కొంది. అనేక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. గోదావరి నదికి వరద నీరు పెరగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. అవసరమైతే తప్ప ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. భారీ వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

## ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి ప్లాన్.. గ్యాస్ కట్టర్లతో మెషిన్ ధ్వంసం.. చివరికి ఏమైందంటే.. ?




**హైదరాబాద్ పెన్ పవర్:**నిజామాబాద్ జిల్లాలో ఎస్?బీఐ ఏటీఎంలో చోరీ కలకలం రేపింది. జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ఎస్బీఐ ఏటీఎంలో నగదు చోరీకి విఫలయత్నం చేశారు దుండగులు. బుధవారం ( ఆగస్టు 20 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నిజామాబాద్ లోని ఓ ఎస్బీఐ ఏటీఎం దగ్గరికి వ్యాన్ లో వచ్చారు మహారాష్ట్రకు చెందిన ముగ్గురు ముఠా సభ్యులు. గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మెషిన్ ను ధ్వంసం చేశారు దుండగులు.ఈ క్రమంలో రూ. 5 లక్షలకు పైగా నగదు కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన సమయంలో ఏటీఎంలో రూ. 25 లక్షలకు పైగా నగదు ఉన్నట్లు సమాచారం. గ్యాస్ కట్టర్లతో మెషిన్ ను ధ్వంసం చేయడంతో ఏటీఎంలోని కొంత నగదు కాలిపోయినట్లు తెలుస్తోంది. చోరీ జరుగుతున్న సమయంలో పెట్రోలింగ్ వాహనం రావడంతో దుండగులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది.

దుండగులను పట్టుకోవడానికి పోలీసులు సుమారు 18 కిలోమీటర్ల పాటు చేజ్ చేసినట్లు తెలిపారు. దుండగులు వ్యాన్ పొలాల్లో వదిలేసి వెళ్లినట్లు సమాచారం. చోరీకి యత్నించిన దుండగులు మహారాష్ట్రకు చెందినవారిగా గుర్తించామని తెలిపారు పోలీసులు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దుండగులు కోసం గాలిస్తున్నామని.. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

## రూ. 20 వేలు లంచం డిమాండ్ చేస్తూ... ఏసీబీకి చిక్కిన అటవీశాఖ ఉద్యోగి...



**హైదరాబాద్ పెన్ పవర్:**సూర్యాపేట జిల్లా కోదాడలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అటవీశాఖ ఉద్యోగి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. బుధవారం ( ఆగస్టు 20 ) జరిగిన ఈ దాడులకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. కోదాడలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా పని చేస్తున్న వెంకన్న చెట్ల వ్యాపారి నుంచి రూ. 20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఏసీబీని ఆశ్రయించాడు బాధితుడు.బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా వెంకన్నను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వెంకన్నను అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నల్గొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసులో సోదాలు నిర్వహించారు అధికారులు.

# తిరుమల శ్రీవారికి రూ.140 కోట్ల విలువైన 121 కిలోల బంగారం విరాళం : సీఎం చంద్రబాబు బయటపెట్టిన రహస్యం



**హైదరాబాద్ పెన్ పవర్:**కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామికి భక్తులు పెద్ద సంఖ్యలో విరాళాలు ఇస్తుంటారు. నగదు, బంగారు, వెండి రూపంలో ఎవరి స్తోమతకు తగినట్లు విరాళాలు స్వామివారికి సమర్పిస్తుంటారు భక్తులు. అయితే.. ఓ ఎన్నారై భక్తుడి విరాళం గురించి సీఎం చంద్రబాబు బయటపెట్టిన రహస్యం సంచలనంగా మారింది. ఓ అజ్ఞాత ఎన్నారై భక్తుడు దేవదేవుడికి ఏకంగా 121 కిలోల బంగారాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తనతో చెప్పాడని.. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని అన్నారంటూ స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది.

మంగళవారం ( ఆగస్టు 19 ) మంగళగిరిలో జరిగిన P4 కార్యక్రమంలో ఈమేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు. తనకు బాగా తెలిసిన ఒక భక్తుడు ఉన్నారని... ఆయన కంపెనీ పెట్టాలని అనుకోని ఎంతో కష్టపడి స్థాపించారని.. కంపెనీ లాభాల్లో నడుస్తున్న సమయంలో 60శాతం వాటా అమ్మారని అన్నారు. దీని ద్వారా ఆయనకు 1.5 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 6 వేల కోట్లు ఉంటుందని అన్నారు సీఎం చంద్రబాబు.

ఈ సంపద అంతా తనకు ఆ వెంకటేశ్వర స్వామి దయ వల్ల వచ్చిందని.. ఆయన విశ్వసించారని అన్నారు చంద్రబాబు. అందుకే స్వామివారికి తిరిగి కృతజ్ఞతగా ఏదైనా సమర్పించుకోవాలని భావించారని అన్నారు. ఈ క్రమంలో 121 కిలోల బంగారాన్ని విరాళంగా ఇస్తున్నారని అన్నారు చంద్రబాబు. దీని మొత్తం విలువ రూ. 150 కోట్లు ఉంటుందని అన్నారు. ఆ అజ్ఞాత భక్తుడు తన పేరు ఎక్కడా బయటపెట్టొద్దని ఓ లేఖ ద్వారా కోరారని తెలిపారు చంద్రబాబు.

తిరుమలలో స్వామివారికి రోజూ 120 కిలోల ఆభరణాలు అలంకరిస్తారని.. ఇప్పుడు యాదృచ్ఛికంగా అజ్ఞాత భక్తుడు 121 కిలోల బంగారం సమర్పిస్తున్నారని అన్నారు చంద్రబాబు. ఈ విషయం అజ్ఞాత భక్తుడికి కూడా తెలిసి ఉండకపోవచ్చని అన్నారు. ఒకే వ్యక్తి ఇంత పెద్ద మొత్తంలో విరాళం సమర్పిస్తున్నారంటే..ఆయనకు దేవుడిపై ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని అన్నారు సీఎం చంద్రబాబు.చంద్రబాబు వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి.. సదరు అజ్ఞాత భక్తుడు

ఎవరై ఉంటారా అని కొంతమంది నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. వచ్చిన లాభాన్ని తన స్వార్దానికి వాడుకోకుండా దేవుడికి విరాళం ఇస్తున్నారంటే ఆ వ్యాపారవేత్త భక్తికి హ్యాట్సాఫ్ అంటూ మరికొంతమంది నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. మరి, ఆ అజ్ఞాత భక్తుడు ఎవరు..?, అతను ఏ ప్రాంతానికి చెందినవాడు వంటి వివరాలు ఎప్పుడు తెలుస్తాయి చూడాలి.

# చర్చలు సఫలం.. హైదరాబాద్‌లో.. ఇంటర్నెట్, కేబుల్ వైర్లను కట్ చేయొద్దని నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్::** TG SPDCL సీఎండీతో కేబుల్ ఆపరేటర్ల చర్చలు సఫలం అయ్యాయి. ఇంటర్నెట్, కేబుల్ వైర్లను కట్ చేయొద్దని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలంగాణ ఇంటర్నెట్ ప్రొవైడర్ ప్రెసిడెంట్ సతీష్ బాబు చర్చల అనంతరం మీడియాకు వెల్లడించారు. రన్నింగ్‌లో ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ఒకే బంచింగ్ విధానంలో తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా కరెంట్?స్తంభాలపై ప్రాణాంతకంగా మారిన కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించడంతో ఎక్కడికక్కడ కేబుల్ వైర్లను కట్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరంలో కేబుల్ వైర్లను తొలగించడంతో ఇంటర్నెట్ కనెక్షన్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జియో, ఎయిర్ టెల్ బ్రాడ్ బ్యాండ్ యూజర్లకు ఉన్నట్టుండి ఇంటర్నెట్ బంద్ అయింది. ఈ పరిణామంతో ఇంటర్నెట్ బంద్ అయిందని, పునరుద్ధరించాలని వేల సంఖ్యలో ఎయిర్ టెల్, జియో బ్రాడ్ బ్యాండ్ విభాగానికి ఫిర్యాదులు అందాయి.కేబుల్ ఆపరేటర్లు హైదరాబాద్ సిటీలోని %ు+ వ్రాణజూ% ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేశారు. సెల్యులర్ ఆపరేషన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(%జూూ×%) కూడా అకస్మాత్తుగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను కట్ తొలగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పరిణామాల అనంతరం.. %ు+ వ్రాణజూ% సీఎండీతో కేబుల్ ఆపరేటర్లు చర్చలు జరిపారు.

చర్చలు సఫలం కావడంతో ఇకపై హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కేబుల్ వైర్లను కట్ చేయకూడదని %ు+ వ్రాణజూ% నిర్ణయించింది. అయితే.. ఆ కేబుల్, ఇంటర్నెట్ వైర్లపై ఆపరేటర్లకు కీలక సూచనలు చేసింది. విద్యుత్ స్తంభాలపై నిరుపయోగంగా పడి ఉన్న కేబుల్ వైర్లను స్వచ్ఛందంగా తొలగించి గణేష్ విగ్రహాల తరలింపునకు ఆటంకం కలగకుండా చూడాలని కేబుల్ ఆపరేటర్లకు స్పష్టం చేసింది.

# హైదరాబాదులో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెస్ మీట్... ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు అల్టిమేటం

- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌పై జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫైర్
- ఎన్టీఆర్, ఆయన తల్లి శాలినిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తీవ్ర ఆరోపణ
- అభిమానికి ఫోన్ చేసి సినిమా ఆపేస్తానని బెదిరించారని తీవ్ర ఆగ్రహం
- ప్రసాద్‌ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని టీడీపీ అధిష్టానానికి విజ్ఞప్తి
- రెండు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని ప్రకటన





**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్‌పైనా, ఆయన మాతృమూర్తి శాలినిపైనా అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై ఎన్టీఆర్ అభిమాన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యే ప్రసాద్ బేషరతుగా, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆయన్ను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అభిమానులు బుధవారం నాడు హైదరాబాదులో మీడియా సమావేశం నిర్వహించారు. తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. రెండు రోజుల్లో తమ డిమాండ్లు నెరవేరకపోతే, అనంతపురంలోని ఆయన ఇంటిని ముట్టడిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

### అసలు ఏం జరిగిందంటే?

ఓ అభిమానికి అర్ధరాత్రి దాటాక తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎమ్మెల్యే ప్రసాద్ ఫోన్ చేసి, ఎన్టీఆర్ సినిమా ప్రదర్శనను అడ్డుకుంటానని, థియేటర్లో రీల్ తగలబెడతానని బెదిరించినట్లు అభిమానులు ఆరోపించారు. ఈ సంభాషణలో జూనియర్ ఎన్టీఆర్‌ను, మాతృమూర్తి అయిన ఆయన తల్లిని కించపరిచేలా అత్యంత జుగుప్సాకరమైన భాష వాడారని వారు మండిపడ్డారు. "ఒక తల్లిని పట్టుకుని, సభ్యసమాజం తలదించుకునేలాంటి మాటలు మాట్లాడటానికి ఆయనకు సిగ్గులేదా? రాజకీయ నాయకుడు సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలి కానీ, ఇలా అభిమానులను బెదిరిస్తూ అసాంఘిక శక్తులను ప్రోత్సహించడమేంటి?" అని పలు జిల్లాల నుంచి వచ్చిన అభిమాన సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. కర్ణాటక, తూర్పు గోదావరి, కృష్ణా, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి వచ్చిన అభిమానులు ఈ సమావేశంలో తమ ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

### పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిందే...!

దగ్గుబాటి ప్రసాద్ కేవలం క్షమాపణ చెబితే సరిపోదని, తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన్ను తక్షణమే సస్పెండ్ చేయాలని అభిమానులు డిమాండ్ చేశారు. "విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు గారు స్థాపించిన పార్టీలో, ఆయన జెండా నీడన గెలిచిన ఒక ఎమ్మెల్యే అయి ఉండి, అదే కుటుంబంపై, ఆ ఇంటి కోడలిపై ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే టీడీపీలో ఇలాంటి నాయకులు ఉండటం పార్టీకే అవమానం. గతంలోనూ కొందరు నాయకులు నందమూరి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసినా మేం సహనంతో ఉన్నాం. కానీ ఇకపై మా ఓపిక నశించింది. దీనికి ఒక ముగింపు పలకాలి. పార్టీ అధిష్ఠానం వెంటనే స్పందించి ప్రసాద్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి దుస్సాహసానికి పాల్పడరు" అని అభిమానులు టీడీపీ అధినేత చంద్రబాబుకు, హోంమంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు.

### రెండు రోజుల డెడ్‌లైన్... ఆ తర్వాత మా ప్రణాళిక మాకుంది...!

ఎమ్మెల్యే ప్రసాద్‌కు అభిమానులు రెండు రోజుల గడువు విధించారు. "ఆయన ఎవరినైతే ఫోన్‌లో బెదిరించారో, ఆ అభిమానిని పక్కన కూర్చోబెట్టుకుని, మీడియా సమక్షంలో బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. అలా చేయని పక్షంలో, ఆయన మాట్లాడిన మాటలను డీజేల రూపంలో అనంతపురం వీధుల్లోనే కాదు, రాష్ట్రమంతా వినిపిస్తాం. ఆయన ఇంటిని ముట్టడించడం ఖాయం. మా హీరో ఎప్పుడూ క్రమశిక్షణతో ఉండాలని, ఎవరినీ నొప్పించవద్దని మాకు నేర్పించారు. అందుకే ఇన్నాళ్లూ ఓపిక పట్టాం. 25 ఏళ్లుగా ఎన్నో అవమానాలు చూశాం. ఇక ఆగేది లేదు. ఎన్టీఆర్ అభిమానుల సత్తా ఏంటో చూపిస్తాం" అని హెచ్చరించారు.

### రాజకీయాలు, సినిమా వేరు!

రాజకీయాలను, సినిమా రంగాన్ని కలపడం సరికాదని అభిమానులు హితవు పలికారు. "మా హీరో తన పని తాను చేసుకుంటూ వెళ్తున్నారు. 25 ఏళ్లుగా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని, ఆస్కార్ స్థాయికి ఎదిగి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటారు. అలాంటి వ్యక్తిపై, ఆయన కుటుంబంపై అనవసరంగా బురద చల్లాలని చూడటం నీచమైన చర్య. ప్రభుత్వం సినిమా ప్రదర్శనకు అనుమతి ఇచ్చిన తర్వాత, మధ్యలో ఈ ఎమ్మెల్యే పెత్తనం ఏంటి? ఆయన పర్మిషన్ మాకెందుకు? ఇది పూర్తిగా వ్యక్తిగత కక్ష సాధింపు చర్యే" అని వారు ఆరోపించారు. మొత్తం మీద, ఈ వివాదం ఇప్పుడు రాజకీయంగానూ వేడి పుట్టిస్తోంది. పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ నిర్ణయంపైనే ఉత్కంఠ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దారి ఎటు అన్నది తేలనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం ఎన్డీఏ కూటమికి, ఇండి కూటమికి దూరంగా ఉంటోంది. తెలంగాణలో కాంగ్రెస్ ను, బీజేపీని అదే స్థాయిలో వ్యతిరేకిస్తుంది. అయితే ఈసారి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ తరుపున సీపీ రాధాకృష్ణన్ పోటీ చేస్తున్నారు. ఆయన తమిళనాడుకు చెందిన నేత. మరొకవైపు ఇండి కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ మామూలుగా అయితే కాంగ్రెస్ కూటమికి దూరం కాబట్టి ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు తెలపాల్సి ఉంటుంది. కానీ ఇండి కూటమి అభ్యర్థి కంటే తెలంగాణ వ్యక్తిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వడం ఇప్పుడు బీఆర్ఎస్ కు అనివార్యంగా మారింది.

### గతంలో జరిగిన ఎన్నికల్లో...

2022లో జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు బీఆర్ఎస్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పుడు కూడా అదే కూటమికి సపోర్టు చేయాల్సి ఉంది. రాజ్యసభలో బీఆర్ఎస్ కు నలుగురు సభ్యులు ఉన్నారు. ఈ నలుగురు ఎవరికి ఓటేస్తారన్నది ప్రజలకు తెలియాల్సి ఉందని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ పార్లమెంటు సభ్యులు వద్దిరాజు




రవిచంద్ర, దామోదర్ రావు, పార్థసారధి రెడ్డి, సుదర్శన్ రెడ్డిలు కేసీఆర్ ఆదేశాల మేరకే తమ ఓటును ఎవరికైనా వేసే అవకాశముంది. కానీ తెలంగాణ వాదిగా బరిలో ఉన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలపాలని ఇప్పటకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. దీంతో కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

### తెలంగాణ వాదిగా...

అందులో ఆయనకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. న్యాయకోవిదుడిగా పేరుంది. వివాదరహితుడిగా ఆయన పేరును ఇండి కూటమి బరిలోకి తెచ్చినా రాష్ట్ర రాజకీయాలను చూస్తే ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం తమ పార్టీ నేతలపై అక్రమ కేసులను బనాయిస్తుంది. ఫార్ములా ఈ కారు రేసు, కాళేశ్వరం కమిషన్ నివేదిక, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి వాటితో కక్ష సాధింపు చర్యలకు దిగుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కూటమి మద్దతిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సపోర్టుగా బీఆర్ఎస్ నిలుస్తుందా? లేక జాతీయ స్థాయిలో మిత్రత్వం సాధించుకునేందుకు బీజేపీ మద్దతిచ్చిన రాధాకృష్ణన్ కు అండగా నిలుస్తుందా? అన్నది చూడాల్సి ఉంది. కానీ తెలంగాణ వాదికా? లేక ఇతరులకా? అన్నది తేల్చుకోవాల్సి ఉంది.

### కేటీఆర్ మాత్రం...

అయితే కేటీఆర్ మాత్రం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన అభ్యర్థికి తాము మద్దతివ్వబోమని కేటీఆర్ తెలిపారు. తాము ఏ కూటమిలో లేమని తమను ఎవరూ సంప్రదించలేదని ఆయన అనడంతో వారి మొగ్గు ఎటువైపు అన్నది అర్థమయింది.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుకూలంగానే తమ వైఖరి ఉంటుందన్నిఆయన, బీసీ అభ్యర్థిని ఎందుకు బరిలోకి దించలేదని కేటీఆర్ ప్రశ్నించారు. అయితే దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ చెప్పడంతో కేసీఆర్ నిర్ణయం అనుకూలంగా ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది. చివరకు బీఆర్ఎస్ అగ్రనేత కేసీఆర్ నిర్ణయమే ఫైనల్ అవ్వడంతో ఎటు వైపు మొగ్గు చూపుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# 30,000 ఉద్యోగాల తొలగింపు.. స్పందించిన టీసీఎస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ఉద్యోగాల తొలగింపు అంశం తీవ్ర కలకలం రేపుతోంది. కంపెనీ వేలాది మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైందంటూ ఐటీ ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. సుమారు 30,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నారని యూనియన్లు ఆరోపిస్తుండగా, టీసీఎస్ మాత్రం ఈ సంఖ్యను ఖండించింది.

సీఐటీయూ మద్దతుతో యునైటెడ్ ఐటీ అండ్ ఐటీఈఎస్ ఎంప్లాయిస్ (యూనైట్) ఆధ్వర్యంలో పలు నగరాల్లో నిరసనలు జరిగాయి. తొలగింపు నిర్ణయాన్ని టీసీఎస్ వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

“తొలగింపునకు గురవుతున్న వారిలో అత్యధికులు అనుభవజ్ఞులే. మంచి నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని కూడా తీసివేయడం ఆందోళన కలిగిస్తోంది” అని యూనైట్ జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే అంతర్జాతీయ కార్మిక సంఘాలతో కలిసి ఈ పోరాటాన్ని ప్రపంచవ్యాప్తం చేస్తామని హెచ్చరించారు.

అనుభవజ్ఞుల స్థానంలో కొత్తగా చేరిన ఫ్రెషర్లను 80-85 శాతం తక్కువ జీతానికి నియమించుకుంటోందని యూనైట్ ఆరోపిస్తోంది. ఉద్యోగులను తొలగించే బదులు వారి నైపుణ్యాలను పెంచాలని హితవు పలికింది. రూ. 2.55 లక్షల కోట్ల ఆదాయం కలిగిన కంపెనీ లాభార్జన కోసం ఉద్యోగులను తొలగించడం అన్యాయమని పేర్కొంది.

ఉద్యోగ సంఘాల ఆరోపణలను టీసీఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు “తప్పుదోవ పట్టించేవి, అవాస్తవం” అని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఉద్యోగులలో కేవలం 2 శాతం మందిపై, అంటే సుమారు 12,000 మందిపై మాత్రమే ఈ ప్రభావం ఉంటుందని స్పష్టం చేసింది. క్లౌడ్, ఏఐ వంటి భవిష్యత్ సాంకేతికతలకు అనుగుణంగా సంస్థను పునర్నిర్మించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు వివరించింది. ప్రభావిత ఉద్యోగులకు పరిహారంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది.

ఈ వివాదంపై కర్ణాటక స్టేట్ ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (కిటు) ఫిర్యాదుతో కర్ణాటక కార్మిక శాఖ రంగంలోకి దిగింది. ఇటీవల కార్మిక శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో టీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని,

ఏ నగరంలో ఎంతమందిని తొలగిస్తారనే దానిపై తుది నిర్ణయం తీసుకోలేదని వారు అధికారులకు వివరించారు. చట్ట ప్రకారం ఉద్యోగుల హక్కులను గౌరవించాలని, వారికి సరైన పరిహారం అందించాలని కార్మిక శాఖ అధికారులు కంపెనీకి సూచించారు.

## హైవే పక్కన రెస్టారెంట్ నడపాలంటే లంచం ఇవ్వాలా..? రూ. లక్ష డిమాండ్ చేస్తూ.. సీబీఐ వలకు చిక్కిన NHAI అధికారి..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైవే పక్కన దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు ఉండటం కామనే.. ప్రతి హైవే పక్కన చిన్న పాన్ డబ్బా, టీ స్టాల్ దగ్గర నుంచి టిఫిన్ సెంటర్లు, పెద్ద పెద్ద రెస్టారెంట్లు కచ్చితంగా ఉంటాయి.. ఇందులో ఆశ్చర్యపోవాల్సిన విషయం లేదు. అయితే.. హైవే పక్కన రెస్టారెంట్ నడపాలంటే లంచం ఇవ్వాల్సి వస్తుందని ఎప్పుడైనా విన్నారా.. అవును హైదరాబాద్ – యాదాద్రి రూట్ లో ఉన్న ఓ రెస్టారెంట్ యజమాని నుంచి రూ. లక్ష డిమాండ్ చేశారు హైదరాబాద్ నేషనల్ హైవే అథారిటీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..బీబీనగర్ టోల్ ప్లాజా పక్కన ఉన్న ఓ రెస్టారెంట్ యజమాని నుంచి లంచం డిమాండ్ చేశారు NHAI అధికారి దుర్గాప్రసాద్. రెస్టారెంట్ నడుపుకోవాలంటే తనకు రూ. లక్ష సమర్పించుకోవాల్సిందే అంటూ కండిషన్ పెట్టారు సదరు అధికారి. దీంతో సీబీఐని ఆశ్రయించారు బాధితుడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు.. రూ. 60 వేలు లంచం తీసుకుంటుండగా... దుర్గాప్రసాద్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.దుర్గాప్రసాద్ ను అరెస్ట్ చేసిన సీబీఐ అధికారులు హైదరాబాద్, వరంగల్, సదాశివపేటలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడి డబ్బులు ఇవ్వద్దని... తమకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు అధికారులు.

## 5 నిమిషాల్లో ఆటో ఆఫర్ పై ర్యాపిడోకు ఫైన్.. కస్టమర్లకు క్యాష్ రీఫండ్ ఆదేశం..




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో టూవీలర్ మొబిలిటీ రంగంలో ర్యాపిడో అతిపెద్ద సంస్థగా ఎదిగింది. ఈ క్రమంలో యూజర్లను తమ ప్లాట్ ఫారం ఉపయోగించేందుకు అనేక యాడ్ క్యాంపెయిన్స్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే 5 నిమిషాల్లో ఆర్డర్ చేయగానే ఆటో మీ ముందు ఉంటుంది లేదంటే రూ.50 రీఫండ్ ఇస్తాం అంటూ చేసిన ఒక ప్రకటనపై భారీగా యూజర్ల నుంచి కంప్లెయింట్స్ వచ్చాయి. దీనిపై స్పందించిన కేంద్ర కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ తాజాగా ర్యాపిడో సంస్థపై రూ.10 లక్షలు జరిమానా విధించింది. ప్రజలకు వేగవంతమైన ఖచ్చితమైన సేవలు అందిస్తామంటూ ఈ యాడ్ ద్వారా ర్యాపిడో భావన కలిగించిందని కానీ దానిని నిలబెట్టుకోవటంలో విఫలమైందని రెగ్యులేటరీ గుర్తించింది. అలాగే యాడ్ లో ప్రామిస్ చేసినట్లుగా రూ.50 ర్యాపిడో డబ్బు రూపంలో కాకుండా కాయిన్స్ ఇచ్చిందని, అది కూడా వారంలో వాడుకోకపోతే ఎక్స్ పెయిరీ అయ్యేలా బైక్ రైడ్స్ కోసం మాత్రమే అందించిందని దర్యాప్తులో గుర్తించబడింది.

ఏడాదిన్నర పాటు నిర్వహించిన ఈ యాడ్ 120 కంటే ఎక్కువ నగరాల్లో ప్రజలకు అందించింది ర్యాపిడో. దీనిపై జూన్ 2024 నుంచి జులై 2025 వరకు 1200 కంటే ఎక్కువ ఫిర్యాదులు రావటంతో సగం కూడా పరిష్కరించలేదు ర్యాపిడో. అయితే ప్రజలకు యాడ్ లో చెప్పినట్లుగా క్యాష్ బ్యాక్ అందించలేదని వారిని తప్పుడు ప్రచారంతో మభ్యపెట్టిందని కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ గుర్తించింది. తాజాగా దీనిపై తీర్పు వెలువరిస్తూ ర్యాపిడో సంస్థ ముందుగా యాడ్ ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని సూచించింది. అలాగే కస్టమర్లకు రూ.50 క్యాష్ రీఫండ్ చెల్లించి దానికి సంబంధించిన రిపోర్ట్ 15 రోజుల్లో అందించాలని ఆదేశించింది.

# మంత్లీ ప్లాన్ రీఛార్జ్ చేసుకునే ఎయిర్‌టెల్, జియో ప్రీపెయిడ్ యూజర్లకు బిగ్ షాక్ !




**హైదరాబాద్ పెన్ పవర్:**2024 జులైలో టారిఫ్?లను భారీగా పెంచి యూజర్లకు షాకిచ్చిన ఎయిర్ టెల్, జియో కంపెనీలు తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నాయి. 24 రోజుల వ్యాలిడిటీతో.. అపరిమిత వాయిస్ కాల్స్?తో పాటు రోజుకు 1 జీబీ డేటా ప్రొవైడ్ చేసిన రీఛార్జ్ ప్లాన్?కు ఎయిర్ టెల్, జియో కంపెనీలు మంగళం పాడాయి. ఇవాళ్టి(ఆగస్ట్ 20, 2025) నుంచి ఎయిర్ టెల్ ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్లలో 249 రూపాయల ప్లాన్ కనిపించదు. ఎయిర్?టెల్ ప్రీపెయిడ్ బేసిక్ ప్లాన్లలో ఈ 249 రూపాయల ప్లాన్ పాపులర్.

ఎయిర్ టెల్ ఇన్నాళ్లూ ఈ 249 రూపాయల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్?లో రోజుకు 1 జీబీ డేటాతో పాటు.. అపరిమిత వాయిస్ కాల్స్ 24 రోజుల వ్యాలిడిటీతో అందిస్తుంది. ఆగస్ట్ 20 నుంచి.. అంటే ఇవాల్టి నుంచి ఈ ప్లాన్ తొలగించినట్లు ఎయిర్ టెల్ స్పష్టం చేసింది. అంతేకాదు.. ఎయిర్ టెల్ ప్రీపెయిడ్ ఎంట్రీ లెవెల్ ప్లాన్ 299 రూపాయల రీఛార్జ్ ప్లాన్ నుంచి అందుబాటులో ఉంది. 28 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 1 జీబీ డేటా కావాలంటే ఎయిర్ టెల్ ప్రీపెయిడ్ యూజర్లు రూపాయి తక్కువ 3 వందలు సమర్పించుకోవాల్సిందే.

ఓటీటీ కంటెంట్ వీక్షించే యూజర్లకు ఈ ప్లాన్ బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. అదెలా అంటే.. ఎయిర్ టెల్ ఎక్స్ స్ట్రీమ్ సబ్ స్క్రిప్షన్ కూడా ఈ 299 రూపాయల ప్లాన్?తో పాటు ఎయిర్ టెల్ అందిస్తోంది. 30 రోజుల పాటు హలోట్యూన్స్ సబ్ స్క్రిప్షన్, 12 నెలల పాటు పర్?ప్లెక్సిటీ ప్రో సబ్ స్క్రిప్షన్ కూడా 299 రూపాయల ప్లాన్?తో రీఛార్జ్ చేసుకుంటే పొందొచ్చు. రిలయన్స్ జియో 249 రూపాయల ప్లాన్?ను ఎత్తేసిన రోజుల వ్యవధిలోనే ఎయిర్ టెల్ కూడా అదే బాటను ఎంచుకోవడం గమనార్హం.

జియోలో కూడా 299 రూపాయల ప్లాన్?తో రీఛార్జ్ చేసుకుంటేనే రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, 28 రోజుల వ్యాలిడిటీ వర్తిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. 28 రోజుల వ్యాలిడిటీతో పాటు రోజుకు 1జీబీ లేదా 1.5 జీబీ ప్లాన్ పొందాలంటే ఎయిర్ టెల్, జియో ప్రీపెయిడ్ యూజర్లు ఇకపై మినిమమ్ 299 రూపాయలు ఖర్చు చేయక తప్పదు.

# గురువును మించిన శిష్యుడు.. జాతీయ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి ప్రత్యేకం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇండి కూటమి తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపికలో కీలక పాత్ర పోషించడం ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయాలను ఆకర్షించారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక ఫలితం ఎలా ఉండబోతుందో అనే విషయమై స్పష్టత ఉన్నప్పటికీ, బలమైన ఎన్డీఏను ఢీకొట్టే అభ్యర్థిగా రిటైర్డ్ న్యాయమూర్తిని తెరపైకి తేవడం వెనుక అనేక వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేయడానికి ప్రతిపక్షాలు ఉప రాష్ట్రపతి ఎన్నికను ఓ వేదికగా మార్చుకున్నా, తెలుగు రాజకీయాల్లో మాత్రం రేవంత్ రెడ్డి వ్యూహమే ఆసక్తికరంగా మారింది.

వాస్తవానికి ఎన్డీఏ అభ్యర్థిపై పోటీ చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయం తీసుకున్న వెంటనే తమిళనాడుకు చెందిన ఎంపీ తిరుచ్చి శివ పేరు ప్రచారంలోకి వచ్చింది. ఎన్డీఏ తరపున తమిళనాడు రాష్ట్రానికి చెందిన నేతను ఎంపిక చేయడం వల్ల, విపక్షం కూడా అదే వ్యూహం అనుసరించాలనే చర్చ జరిగింది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యంతో అనూహ్యంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. రేవంత్ రెడ్డి పక్కా వ్యూహంతోనే సుదర్శన్ రెడ్డిని తెరపైకి తెచ్చారని, ఈ ఎంపిక ద్వారా ఆయన జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నారని అంటున్నారు. అదే సమయంలో రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానానికి మధ్య పొసగడం లేదని, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో అనుబంధం తెంచుకోలేకపోతున్నారన్న విమర్శలకు ఆయన చెక్ చెప్పినట్లే అంటున్నారు. ఓ విధంగా చెప్పాలంటే తన రాజకీయ గురువు చంద్రబాబును మించేలా వ్యూహరచన చేసి జాతీయ రాజకీయాల్లో తెలుగు



నేతలకు ప్రతిష్ఠ పెంచారని ప్రశంసలు అందుకుంటున్నారు రేవంత్ రెడ్డి.

2023లో బీఆర్ఎస్ ను గద్దె దించి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఓ విధంగా ఆయన కనిపించే శత్రువులతోపాటు తెరచాటున కత్తి దూస్తున్న అంతర్గత శక్తులతోనూ యుద్ధం చేయాల్సివస్తోందని అంటున్నారు. ముఖ్యమంత్రి పదవిని ఆశించిన పలువురు కాంగ్రెస్ సీనియర్లు అడుగడుగునా రేవంత్ రెడ్డికి అవాంతరాలు సృష్టిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేరుగానే విమర్శలు చేస్తుండగా, ఆయనకు వెనుక నుంచి పలువురు ఉసిగొల్పుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో తన మంత్రివర్గంలో ఎవరు మంత్రులుగా ఉండాలనే స్వేచ్ఛ ఇవ్వకుండా కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డికి పరిమితులు విధించిందనే ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు భుజాలపై గన్ పెట్టి రేవంత్ రెడ్డిని కాల్చాలని ప్రతిపక్షం బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి చంద్రబాబు రుణం తీర్చుకునేలా పనిచేస్తున్నారని ఆరోపిస్తోంది.

ఇంటా బయటా ఎదురవుతున్న ఈ సవాళ్ల నుంచి బయటపడేందుకు రేవంత్ రెడ్డి ఇన్నాళ్లు తగిన సమయం కోసం ఎదురుచూశారని, ఉప రాష్ట్రపతి ఎన్నికలను అందుకు వేదికగా చేసుకునే తనపై జరుగుతున్న ప్రచారం, విమర్శలకు ఒకేసారి చెక్ చెప్పారని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ బీజేపీ పెద్దలతో రేవంత్ రెడ్డి సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు, ఆరోపణలు కూడా ఆయనను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని అంటున్నారు. ఈ ప్రచారానికి కూడా రేవంత్ రెడ్డి ఇప్పుడు సమాధానమిచ్చినట్లైందని అంటున్నారు. తెలుగు వారిని బరిలోకి దింపడం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్క కాంగ్రెస్ మాత్రమే బీజేపీని, ఆ పార్టీ అనుసరిస్తున్న హిందుత్వను వ్యతిరేకిస్తున్నట్లు రేవంత్ రెడ్డి చాటగలిగారని అంటున్నారు. ఈ విధంగా కాంగ్రెస్ పార్టీపై మైనార్టీల్లో మరింత ఆదరణ పెరిగేలా వ్యూహం రచించారని అంటున్నారు.ఇక స్వరాష్ట్రంలో తెలంగాణ బ్రాండ్ కు ఏకైక అంబాసిడర్ గా చెప్పుకునే బీఆర్ఎస్ కు రేవంత్ రెడ్డి ఝలక్ ఇచ్చారని అంటున్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన రిటైర్డ్ న్యాయమూర్తిని ఎంపిక చేయడం విద్యావంతులు, యువతలో కూడా ఆలోచనలు రేకెత్తించిందని అంటున్నారు. అధికారంలో ఉండగా దేశ్ కీ నేతగా చెప్పుకున్న కేసీఆర్ గతంలో ఈ విధంగా తెలంగాణ ప్రముఖులకు జాతీయ స్థాయిలో గౌరవం తెచ్చే పనిచేయలేదని చెప్పుకునేలా రేవంత్ రెడ్డి నిర్ణయం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా రేవంత్ రెడ్డి షాక్ ఇచ్చారని అంటున్నారు. బీజేపీ భాగస్వామిగా టీడీపీ, తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణణ్ కు మద్దతు ప్రకటించింది. అయితే టీడీపీ పుట్టుకతోనే వినిపించిన తెలుగు వారి ఆత్మ గౌరవం అన్న నినాదం చంద్రబాబును ఇరుకున పెడుతోందని అంటున్నారు. జాతీయ స్థాయిలో తెలుగువారి ఔన్నత్యాన్ని చాటిచెప్పే సుదర్శన్ రెడ్డి పోటీపై చంద్రబాబు పునరాలోచనలో పడేలా రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

# తెలుగు గర్వం గౌరవం జస్టిస్ సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆయన నిలువెత్తు న్యాయం. ఆయన నిబద్ధతకు మారు రూపం. ఆయన గొంతు సమానత్వం అంటుంది. ఆయన చూపు సమ న్యాయం సామాజిక న్యాయం వైపు ఉంటుంది. ఇంతకీ ఆయన ఎవరో కాదు జస్టిస్ సుదర్శన్ రెడ్డి. అచ్చ తెలుగు బిడ్డ. తెలుగు జాతికి ఆయనే ఒక గౌరవం. సిసలైన న్యాయానికి అసలైన దర్పణం. దేశంలోని అత్యున్నత రెండవ రాజ్యాంగ పదవికి అనూహ్యంగా ఆయన అభ్యర్థి అయ్యారు. దేశంలో రెండు కూటముల మధ్య ఢీ కొడుతున్న రాజకీయం రాజ్యాంగ పదవి వైపు సైతం సాగుతున్న వేళ ఈ సమున్నత పదవికి రాజ్యాంగ నీతి కోవిదుడు, న్యాయ స్రష్ట అయిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం ఒక మంచి ఎంపిక. ఒక మేలు మలుపుగా అంతా భావిస్తున్నారు.

**రాజకీయ వాసనలు లేని వైనం :**

ఆయన ఏ పార్టీకి చెందిన వారు కాదు, రాజకీయ వాసనలు అంతకంటే అంటని వారు. ఆయన గురించి నిఖార్సుగా చెప్పాలీ అంటే ప్రజల పక్షం. పేదల పక్షం, బడుగుల పక్షం. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎన్నో తీర్పులు ఇచ్చారు. వాటిని చూసిన వారికి అర్ధమయ్యేది ఏమిటి అంటే ఆయన న్యాయం పక్షం అని. ఆయన ఎన్నో విలక్షణమైన తీర్పులు ఇచ్చారు. అవి సంచలనం రేపాయి. ప్రజాస్వామ్య పరులలో ఆలోచనలు రేకెత్తించాయి. మేధావులలో చర్చలకు తావిచ్చాయి.

**సరైన సమయంలో ధీటైన అభ్యర్థి :**

ఈ రోజున దేశంలో ఒక పెద్ద చర్చ సాగుతోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం చాలా గొంతులు వినిపిస్తున్నాయి. ఉన్నత స్థానాలలో మరింత సమున్నతమైన తీరున వ్యవస్థలు సాగాలని సకల జనం అభిలషిస్తున్నారు. అవసరమైతే మరింత మార్పులు చేర్పులు కూడా చేయాలని తపిస్తున్నారు. ఈ కీలక సమయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ముందుకు రావడం అంటే నిజంగా గొప్ప విషయమే. ఒక విధంగా అరుదైన అవకాశమే అని చెప్పాలని అంటున్నారు.

**ఉప రాష్ట్రపతి స్థానం రాజ్యాంగబద్ధమైన పదవి :**

అవును ఉప రాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదు, రాజ్యాంగబద్ధమైన పదవి ఈ పదవికి ఇండియా కూటమి పోటీగా నిలిపిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్ని విధాలుగా సరైన అభ్యర్థి అని అంతా అంటున్నారు. ఇదిలా ఉండగా ఈ పదవికి ఇండియా కూటమి అభ్యర్థిగా ఎంపిక తరువాత సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తన భావాలను పంచుకున్నారు. అత్యున్నతమైన రాజ్యాంగబద్ధమైన ప్దవి విషయంలో జరుగుతున్న ఎన్నికల్లో దేశంలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు సరైన నిర్ణయం తీసుకుంటారనుకుంటున్నానని చెప్పారు. ఈ ఉన్నత పదవికి సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని ఎంపీలను కోరుతున్నానని ఆయన చెప్పారు.

**సమానత్వం స్వేచ్ఛ కోసం :**

ఈ సందర్భంగా ఆయన మరిన్ని విషయాలు తన గురించి మీడియా ముఖంగా పంచుకున్నారు. ఇది రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న పోరు కాదు అని స్పష్టం చేశారు. అంతే కాదు తనకు ఎలాంటి భావజాలం లేదని స్పష్టత ఇచ్చారు. ఇక తనకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు అని తేల్చి చెప్పారు. ఇక తనకు సమానత్వం స్వేచ్ఛ పై పూర్తి అవగాహన ఉంది అని ఆయన పేర్కొన్నారు. అందువల్ల తాను ఈ పదవికి అర్హుడను అని ఆయన చెప్పకనే చెబుతున్నారు.

**మార్పు మొదలవ్వాలి :**

ఇదే సందర్భంలో ఆయన మరిన్ని కీలక వ్యాఖ్యలు చేశారు భారత రాజకీయ వ్యవస్థలో కొంత మార్పు జరగాలని ఆకాంక్షించారు. రాజ్యసభను నిష్పక్షపాతంగా నడపటం అవసరం అని ఆయన నొక్కి చెప్పారు. పెద్దల సభగా గౌరవ సభగా ఉన్న రాజ్యసభలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలన్నది తన అభిమతమని చెప్పారు. ఇక తనను ఉప రాష్ట్రపతిగా ఎన్నుకుంటే రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద చూస్తే సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి పదవి విషయంలో తన అభిప్రాయాలు చెప్పారు మేధావుల నుంచి వస్తున్న చర్చ కూడా ఆయన సరైన అభ్యర్థి అని. మరి చూడాలి ఈ పోటీలో అనూహ్యంగా ఆయన నెగ్గుతారేమో అన్నది.